అభివృద్ధి చేశారు.. నిర్వహణ మరిచారు



నాడు: 26వ వార్డు చాకలిపేటలో అభివృద్ధి చేసిన పార్కు



నేడు: నిర్వహణ లోపంతో కళావిహీనంగా తయారైన పార్కు

- దీన స్థితిలో చాకలిపేట పార్కు
- మందుబాబులు, ఆకతాయిలకు అడ్డా
- ఇబ్బంది పడుతున్న పిల్లలు, మహిళలు
- పట్టించుకోని అధికారులు

సీతంపేట: లక్షల రూపాయలు వెచ్చించి జీవీఎంసీ నిర్మించిన పార్కు నిర్వహణ లోపంతో మందుబాబులకు అడ్డాగా మారింది. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లోని చాకలిపేటలో రూ.16.30 లక్షలతో పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. గత మార్చిలో దీనిని ప్రారంభించారు. నాలుగున్నర నెలలు గడిచినా.. అధికార యంత్రాంగం పార్కు నిర్వహణ విషయాన్ని గాలికి వదిలేసింది. దీంతో మందుబాబులు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పార్కులో మద్యం తాగి అక్కడే ఖాళీ బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు పడవేస్తున్నారు. మందుబాబులకు భయపడి పార్కుకు వెళ్లడానికి పిల్లలు మహిళలు జంకుతున్నారు. ఇదే అదనుగా మందుబాబులు రెచ్చిపోతున్నారు. పార్కును ఆవాసంగా చేసుకున్నారు. వేళాపాలా లేకుండా మద్యం తాగుతూ జల్సా చేస్తున్నారు. వారిని ఇదేంటని అడగడానికి స్థానికులు భయపడి మౌనంగా ఉండిపోతున్నారు. దీంతో లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేసిన పార్కు నిరుపయోగంగా మారింది.



పార్కులో మందుబాబులు తాగిపారేసిన మద్యం బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు

సిమెంట్ బెంచీలు ధ్వంసం

పార్కులో వాకింగ్ చేసేవారు కాసేపు సేదతీరడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను సైతం ఆకతాయిలు విరగ్గొట్టారు. పార్కులో చుట్టూ వాకింగ్ ట్రాక్ మధ్యలోని ఖాళీ స్థలంలో రెండు వైపులా 10 సిమెంట్ బెంచీలు అమర్చారు. వీటిలో 5 బెంచీలను ధ్వంసం చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పార్కులో కొన్ని అభివృద్ధి పనులు అప్పట్లో పెండింగ్ పెట్టారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ గ్రీనరీ, ట్రాక్ మధ్యలో మొక్కలు నాటాల్సి ఉంది. పిల్లల ఆటపరికరాలు అమర్చాల్సి ఉంది. ఎన్నికలు ముగిసినా.. పెండింగ్ పనులు చేపట్టలేదు. సంబంధిత అధికారులు స్పందించి పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేసి, నిర్వహణ బాధ్యత ఎవరికైనా అప్పగించాలని, మందుబాబులు, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కొండవాలు సమస్యలపై స్పందించండి



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలపై స్పందించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా ఆమె కమిషనర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. వార్డులో పర్యటించి సమస్యలను గుర్తించి, పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసేలా కృషి చేయాలని కోరారు. వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమర్ క్లబ్ కార్యదర్శి మృతికి సంతాపం



నందూరి ప్రభాకర్(ఫైల్)

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి నందూరి ప్రభాకర్ అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి మృతిచెందారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ క్లబ్ సభ్యులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్. రామానుజం, ఇ.భానుప్రకాష్, శ్రీపాద చిదంబరం, మేడా మస్తాన్‌రెడ్డి, వఠ్రే నాంచారయ్య, హేమ సంతాపం వ్యక్తం చేశారు. నగరంలోని పలు కామెడీ క్లబ్‌ల కళాకారులు సోమవారం తమ సంతాపం తెలిపారు.

మాంసం దుకాణదారులపై చర్యలేవి?



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెట్టు వద్ద మాంసం కడిగిన నీరు, వ్యర్థాలు వేస్తున్న దుకాణదారుడు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాంసం దుకాణదారులు వ్యర్థాల నీటిని అక్కడ రోడ్డు మధ్యలో ఉన్న మొక్కలపై పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. శానిటరీ అధికారులు దృష్టి సారించి మాంసం దుకాణదారులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతమ్మధార: స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును సోమవారం 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ కలిశారు. వార్డులోని సీతంపేటలో పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించారు. వార్డు పరిధిలో డ్రైయిన్‌పై కల్వర్ట్ నిర్మాణం, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, కొద్దిసేపు కార్పొరేటర్‌తో చర్చించారు.

రక్త నిల్వల జాబితా ప్రదర్శించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రక్త నిల్వల జాబితా, వివరాలు ప్రతి బ్లడ్‌బ్యాంకులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఉన్న బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులతో సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో కనీసం రెండు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన సమాచారాన్ని జిల్లా అధికారులకు ఇవ్వాలన్నారు. హెపటైటిస్-బి, సి పాజిటివ్ కేసులు, హెచ్ఐవీ, సిఫిలిస్ కేసుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని తెలిపారు. ముఖ్యంగా తలసేమియా కేసులకు ఉచితంగా రక్తం సరఫరా చేయాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్‌ల నిర్వహణకు లైసెన్స్, శిబిరాల నిర్వహణకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక తగిన స్థాయిలో ప్లేట్‌లెట్లను ప్రతి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉంచుకోవాలన్నారు. ఏ ఒక్కరికి బ్లడ్ లేదంటూ నిరాకరించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్టు నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, సహాయ అధికారి ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్లు బద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కరపత్రం, పోస్టర్‌ను కలెక్టర్ హరిందిర ప్రసాద్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్ టి.సీతారామ మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎల్.మహేంద్రనాథ్, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ వాకర్ కృష్ణారావుకు సత్కారం



కృష్ణారావు దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆరోగ్యవంతమైన సీనియర్ సిటిజన్స్‌కు మారుపేరుగా నిలుస్తోంది. ఈ క్లబ్‌లో 870 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 80 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు 130 మంది ఉంటారు. 90 ఏళ్ల వయసు దాటిన వారిలో నిమ్మగడ్డ బుచ్చయ్య(91), రాళ్లపల్లి సత్యనాథం(90), కె.జి.కృష్ణారావు(90) ఉన్నారు. వీరు ముగ్గురు వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులుగా పనిచేశారు. వీరు ఏడాది పొడుగునా నిత్యం పార్కును సందర్శించడమే కాకుండా వాకర్స్ క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వీరిలో కె.జి.కృష్ణారావు ఆదివారం నాటికి 90వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా సోమవారం ఆయనను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కృష్ణారావు మాట్లాడుతూ తమకు ఆప్తమిత్రులుగా వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రేమాభిమానాలు పంచడం వల్ల, నిరంతరం కనీసం వ్యాయామం చేయడం వల్లే తాము ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటున్నామని చెప్పారు. కృష్ణారావు సేవలను పలువురు కొనియాడారు. బుచ్చయ్య మాట్లాడుతూ కృష్ణారావు తన సహోద్యోగిగా, వాకర్స్ క్లబ్‌లో తనతో గల అనుబంధాన్ని గుర్తుచేశారు. సత్యనాథం మాట్లాడుతూ కృష్ణారావు లాంటి మంచి వ్యక్తుల పరిచయం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు కె.ద్వారకానాథ్, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, మళ్ల రామకృష్ణ, కార్యదర్శి పి.చెల్వరాజు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, రామారావు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై సమీక్ష నేడు

ఎంవీపీకాలనీ: మాదకద్రవ్యాల నిర్మూలన, రవాణా, కళాశాల విద్యార్థులపై ప్రభావం అంశంపై మంగళవారం జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించనుంది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సమీక్ష జరగనున్నట్లు సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొనున్నారు. డ్రగ్స్ నిర్మూలన, విద్యార్థులపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిషన్ చైర్మన్, సభ్యులు వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. మంగళవారం ఉదయం కేజీహెచ్ డాక్టర్లు, హాస్పిటళ్ల యాజమాన్యాలతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశం జరపనుంది.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల పంపిణీ



ఆరో తరగతి విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న గాదె వెంకటసుబ్బయ్య దంపతులు



రాంజీ ఎస్టేట్ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దాతలు, స్కూల్ సిబ్బంది

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో ఆరో తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు గాదె వెంకటసుబ్బయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సోమవారం 150 భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలు ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. పాఠశాల తరఫున దాతలకు హెచ్ఎం డి.రాంప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు.

పోషకాహారం అందించిన ఉపాధ్యాయులు

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్ఎంసీ హైస్కూల్‌లో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులే దాతలుగా విరాళం ఇచ్చారు. విద్యార్థులకు పోషకాహారం అరటిపండ్లు, యాపిల్, జామికాయలు అందజేశారు.

విద్యార్థులకు వితరణ

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బీజేపీ వార్డు అధ్యక్షురాలు గునుపూడి అరుణ భోజనం స్టీల్‌ప్లేట్లు, గ్లాస్‌లు వితరణ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా తిథి భోజన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు అందజేశారు. హెచ్ఎం దొరబాబు, బీజేవైఎం నగర నాయకులు గునుపూడి అరుణ్‌బాబు, స్థానిక నాయకులు భాను, బంగారి, బీమా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రిమాండ్‌కు మద్యం బాటిళ్లు కలిగిన వ్యక్తి

అల్లిపురం: ఈ నెల 27వ తేదీన సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు 31వ వార్డు జనసేన బూత్ కమిటీ సభ్యుడు శీరం రాజును 21 మద్యం సీసాలతో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నిందితుడిని మద్యం బాటిళ్లతో సహా టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీంతో టూటౌన్ సీఐ బి.తిరుమలరావు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అండర్-16 విజేత విశాఖ

విశాఖ స్పోర్ట్స్: అండర్ 16 మల్టీడే అంతర జిల్లాల మ్యాచ్‌ల ఫైనల్‌లో విశాఖ జట్టు 433 పరుగుల తేడాతో విజయం సాధించింది. నెల్లూరు వేదికగా మూడు రోజుల పాటు జరిగిన తుది పోరులో కృష్ణా జట్టుపై టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు ఏడు వికెట్లకు 456 పరుగుల చేసింది. శ్రావన్ 113, రోహన్ 151 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా ఈశ్వర్ 87 పరుగులు చేశాడు. కృష్ణా బౌలర్ సాయి సాత్విక్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా కృష్ణా జట్టు 148 పరుగులకే ఆలౌటైంది. భానుస్వరూప్ ఆరు వికెట్లు తీయగా గౌతమ్ రెండు వికెట్లు తీశాడు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తన బంగ్లా నుంచి బ్యాటరీ వాహనంలో జీవీఎంసీకి వచ్చారు. అనంతరం వారిద్దరు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ మండల తహసీల్దార్‌గా సోమవారం ఎం.రమేష్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన రమేష్ 1996–2012 వరకు ఉమ్మడి రాష్ట్రం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో పనిచేశారు. 2012లో చినగదిలి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. అమరావతి సెక్రటేరియట్‌లోని వైద్య, ఆరోగ్య శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేసి సీతమ్మధార మండల తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి సర్టిఫికెట్ ఒరిజనల్ చూసి జారీ చేయాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందరూ విధులు నిర్వహించి ఇంటికి వెళ్లి పోవాలన్నారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ కోరాడ రామలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశించారు. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు ఎక్కువగా ఉందంటూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, పారిశుధ్య సమస్యపై పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు తారా, ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్ఎం కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ముందు ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సెలవులు అమలుచేయాలని కోరారు. కాంట్రాక్టర్ మారితే ఉద్యోగులను తొలగించడం వంటివి చేస్తున్నారని, మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. 45 ఏళ్ల వయో పరిమితిని 60 ఏళ్ల వరకు పొడిగించాలని వీరు కోరారు. కార్యక్రమంలో ఎం.రాంబాబు, ఒ.అప్పారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, యు.వి.రాజు, వెంకటరావు, మౌళి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వొద్దు



పోర్టు హాస్పిటల్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలనే కేంద్ర మంత్రి ప్రతిపాదనను విరమించుకోవాలని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పోర్టు హాస్పిటల్ ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు హాస్పిటల్‌ను రూ.222.43 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు శుక్రవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించారని, ప్రస్తుతం కైలాసపురంలో 80 పడకల ఆస్పత్రిని పీపీపీ భాగస్వామ్యంతో 300 పడకల హాస్పిటల్‌గా మార్చాలని ప్రతిపాదన చేశారని వివరించారు. వెంటనే దీనిని విరమించుకోవాలన్నారు. ఈ హాస్పిటల్‌పై ఆధారపడి 4 వేల మంది ఉద్యోగులు, అధికారులు, 13 వేల మంది పెన్షనర్లు ఉన్నారని, దీనిని పీపీపీకి ఇస్తే వీరందరికీ వైద్యాన్ని దూరం చేస్తారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెంటనే ఆపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.పద్మనాభరాజు, సిటు నాయకులు బి.జగన్, బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, లక్ష్మణ్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



ప్రజా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్



ఫ్రూట్ మార్కెట్ వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: వీధుల్లో వ్యాపారులు ఆక్రమణలు వెంటనే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ జోన్-4 పరిధి 35వ వార్డులో అధికారులతో కలిసి పర్యటించారు. దుర్గాలమ్మ గుడి నుంచి అయిల్‌మిల్లు సందురోడ్డు, ప్రసాద్‌గారెన్స్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం రోడ్డు, రామకృష్ణా థియేటర్ జంక్షన్, జనతాకాలనీ, గాజులవీధి, పోలీసు బ్యారెక్స్, కల్లుపాకలు ప్రాంతాల్లో పర్యటించి కాలువలు, రహదారులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు వీధులు, రోడ్లను ఆక్రమించుకోవడంతో కాలువల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. హోల్‌సేల్ ఫ్రూట్‌మార్కెట్, వెదురు, స్క్రాప్ దుకాణాల ప్రాంతాల్లో అధికంగా ఉన్న వ్యర్థాలను గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించి పరిశుభ్రం చేయాలన్నారు. జనతాబజార్ వద్ద వ్యాపారులు రహదారిని ఆక్రమించుకోవడం గమనించిన ఆయన స్క్రాప్‌ను వెంటనే తొలగించాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు అపరాధ రుసుము విధించాలని జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ప్రసాద్‌గార్డెన్స్‌లో ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కేర్‌టేకర్‌ను ఆదేశించారు. జనతాబజార్ వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటీన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరింగ్ అధికారి సత్యనారాయణరాజుకు ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.దామోదర్, ఈఈ సంతోషికుమారి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, డీఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.